www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 21 జూన్ 2024 5

ఏలూరు

వరి సాగుకు ప్రణాళికలు సిద్ధం

వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు

బుట్టాయగూడెం: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట ప్రధాన పంటగా 4,420 ఎకరాల్లో సాగు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారని, అందుకనుగుణంగా 221 ఎకరాల వరినారు మల్లు అవసరం అవుతాయని మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు గురువారం తెలిపారు. జైన వారి గూడెం రెడ్డి గణపవరం, విప్పలపాడు మొదలైన గ్రామాల్లో ఆయన పర్యటించి ఆయా గ్రామాల్లో నారుమడులను పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా కొన్ని సూచనలను రైతులకు తెలియజేశారు. ముందుగా ఒక ఎకరానికి సరిపడా నారుమడి, 5 సెంటర్‌లో మట్టిని గడ్డలు లేకుండా తయారు చేసుకోవాలని, ఒక ఎకరానికి సుమారుగా 25 నుంచి 35 కేజీల విత్తనాలు అవసరమవుతాయని, నారుమడిని నారు పోయడానికి పది రోజుల ముందే దున్ని శుభ్రం చేసుకోవాలని తెలిపారు. నీరు పెట్టడానికి, నీరు తీయడానికి అనువుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఎంఎల్‌ఎల ప్రమాణ స్వీకారం నేడే

రెండు జిల్లాల నుంచి 14 మంది ఎన్నిక

సగం మంది కొత్తవారే

ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రజల్లో గంపెడాశలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్‌ఎలుగా గెలిచిన వారంతా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అన్నిస్థానాల్లో టిడిపి కూటమి అభ్యర్థులే గెలవడంతో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రజలు అనేక గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రమాణ స్వీకారం చేసి ఎంఎల్‌ఎలుగా బాధ్యతలు తీసుకున్నాక నాయకులంతా జిల్లా అభివృద్ధిపై ఏవిధంగా ముందుకు సాగుతారోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఏలూరు జిల్లాలో ఏడు, పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు, మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మే 13న ఎన్నికలు జరగ్గా జూన్ నాలుగో తేదీన ఫలితాలు వెలువడ్డాయి. జిల్లాలోని 14 స్థానాల్లోనూ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులే గెలుపొందారు. ఈ నెల 12న సిఎం, మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. 21, 22 తేదీల్లో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి గెలిచిన ఎంఎల్‌ఎలతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ప్రోటెం స్పీకర్‌గా నియమితులైన సీనియర్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి గెలిచిన ఎంఎల్‌ఎలతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. జిల్లాలోని 14 మంది ఎంఎల్‌ఎల్లో ఏడుగురు కొత్తగా ఎన్నికకాగా, మరో ఏడుగురు గతంలో ఎంఎల్‌ఎలుగా పని చేసిన వారే. పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు స్థానాల్లో నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తొలిసారి ఎంఎల్‌ఎలుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు గతంలో ఎంఎల్‌ఎలుగా పని చేశారు. ఏలూరు జిల్లాలోని ఏడు స్థానాల్లో చింతలపూడి ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్, పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి కొత్తగా ఎన్నికయ్యారు. నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారధి, కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ గతంలో ఎంఎల్‌ఎలుగా పని చేసిన వారే. తమ నాయకులు ఎంఎల్‌ఎలుగా ప్రమాణ స్వీకారం చేయనుండటంతో ఆయా నియోజకవర్గాల్లోని నాయకుల అనుయాయులంతా ఆనందోత్సాహాల్లో తేలియాడుతున్నారు. గెలిచిన ఎంఎల్‌ఎల్లో నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధి ఇప్పటికే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాలోని అన్నిస్థానాల్లో అధికార పక్ష ఎంఎల్‌ఎలే ఉండటంతో జిల్లాలో అభివృద్ధి పరుగులు తీస్తుందని ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాను అనేక సమస్యలు దీర్ఘకాలంగా వెంటాడుతున్నాయి. తాగునీటి సమస్య, రోడ్లు, కొల్లేరు, చింతలపూడి ఎత్తిపోతల భూనిర్వాసిత రైతులకు పరిహారం, పోలవరం నిర్వాసితులకు పరిహారం అందజేత, పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర, ఆక్వా రైతుల సమస్యలు, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు, కాలుష్యం, డెల్టా ఆధునీకీకరణ ఇలా అనేక సమస్యలతో జిల్లా ప్రజానీకం సతమతమవుతున్నారు. ఎంఎల్‌ఎలంతా ఒక్కతాటిపై ఉంటూ జిల్లా సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు. నమ్మి గెలిపించిన ప్రజల కోసం ఐదేళ్లలో ఎంఎల్‌ఎలు ఏం చేస్తారో వేచిచూడాలి.

ఖరీఫ్ ఆలస్యమే..!

- జూన్ ఒకటిన కాలువలకు నీరు విడుదల
- రెండు జిల్లాల్లో 20 శాతం పూర్తికాని నారుమడులు
- జులై నెలాఖరు వరకూ నాట్లు సాగే అవకాశం
- ముందస్తు సాగు ప్రణాళిక అమలులో లోపాలు
- కౌలురైతులకు కౌలు కార్డుల జారీలో ఇంకా నిర్లక్ష్యమే
- కొత్త ప్రభుత్వం రైతుల సమస్యలపై దృష్టి సారిస్తేనే మేలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్‌లో ముందస్తు సాగు ప్రణాళిక అమలుకావడం లేదు. ఈ ఏడాది సైతం ఖరీఫ్ నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. జూన్ ఒకటో తేదీన పంట కాలువలకు సాగునీరు విడుదల చేశారు. ఇప్పటికీ అరకొరగానే నారుమడులు పూర్తయ్యాయి. ప్రస్తుత పరిస్థితి చూస్తే జులై నెలాఖరు వరకూ ఖరీఫ్ నాట్లు కొనసాగే పరిస్థితి కన్పిస్తోంది. ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా దాదాపు నాలుగు లక్షల రైతులు వరిసాగు చేస్తున్నారు. ఖరీఫ్ సాగు ఆలస్యం కావడంతో మాసూళ్లు నవంబర్ నెలలో రావడంతో తుపాన్లకు పంటలు దెబ్బతింటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఖరీఫ్ ఆలస్యమవడంతో రబీ సాగుసైతం సకాలంలో సాగడం లేదు. గతంలో రైతులు వేసవిలో అపరాల సాగుగా పండించే మినుము, పెసర వంటి పంటల సాగు సైతం లేకుండాపోతుంది. దీంతో రైతులు అన్నివిధాలుగా నష్టపోతున్న పరిస్థితి. జూన్ ఒకటో తేదీన కాలువలకు సాగునీరు విడుదల చేసి ముందస్తుగా ఖరీఫ్ సాగు పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నా వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా కొనసాగుతోంది. అనుకున్నట్లుగా జూన్ ఒకటిన సాగునీరు విడుదల చేసినప్పటికీ నారుమడులు వేయడంలో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. కాలువలు వదిలి 20 రోజులు గడిచినా ఇప్పటి వరకూ రెండు జిల్లాల్లో 20 శాతం నారుమడులు పూర్తికాని పరిస్థితి నెలకొంది. వేసిన నారుమడులు సైతం మెట్ట ప్రాంతంలోనే ఎక్కువగా ఉన్నాయి. డెల్టాలో ఇంకా నారుమడులు ఊపందుకోలేదు. నారుమడులు ఆలస్యం కావడంతో జులై నెలాఖరు వరకూ నాట్లు సాగే పరిస్థితి నెలకొంది. ముందస్తుగా సాగునీరు విడుదల చేసినా ప్రయోజనం లేకుండా పోతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ముందస్తు సాగుకు రైతులను సిద్ధం చేయడంలో రెండు జిల్లాల్లోనూ వ్యవసాయశాఖ విఫలమవుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖరీఫ్ సాగు ఆలస్యం కావడంతో ప్రతియేటా మాసూళ్ల సమయంలో వరదలు, తుఫాన్లు విరుచుకుపడటంతో రైతులు పెద్దఎత్తున పంటలను నష్టపోవడం జిల్లాలో సాగుతోంది. అందుకు ప్రధాన కారణం కాలువల ఆధునీకీకరణ పనులు చేపట్టకపోవడమేనని అందరికీ తెలిసిందే. కాలువలు మెరకతేరిపోయి చిన్నపాటి వర్షాలకు సైతం పొలాల్లో నీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ముందస్తు సాగు ప్రణాళికలు మాటలకు పరిమితం కావడం తప్ప ఆచరణలో ముందుకు సాగడం లేదు.

కౌలుకార్డుల జారీలో తీవ్ర నిర్లక్ష్యం

ఖరీఫ్ నారుమడులు ఆరంభమైనప్పటికీ కౌలుకార్డుల జారీలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. గతంలో మాదిరిగా రైతుభరోసా కేంద్రాల ద్వారా కౌలుకార్డులు జారీ చేయాలని వ్యవసాయ శాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే వెబ్‌సైట్ మాత్రం తెరవలేదు. దీంతో రెండు జిల్లాల్లోనూ ఇప్పటి వరకూ కౌలుకార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. అర్హులైన కౌలురైతులందరికీ కౌలుకార్డులు జారీ చేస్తే బ్యాంకుల నుంచి పంటరుణం, ప్రభుత్వం అందించే సాయం దక్కే అవకాశం ఉంటుంది. కౌలురైతులకు న్యాయం చేస్తామంటూ టిడిపి కూటమి ఎన్నికల్లో చెప్పింది. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వెంటనే రైతులు, కౌలురైతుల సమస్యలపై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు. లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది.

సంక్రాంతి నాటికి వెయ్యి టిడ్కో ఇళ్లు

రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి

టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విశాలదృక్పథం, దూరదృష్టి లేని నాయకత్వం ఉంటే రాష్ట్రం ఏ విధంగా నాశనమవుతుందో టిడ్కో ఇళ్లు పూర్తి కాకపోవడమే నిదర్శనమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. స్థానిక ఎంఆర్ అప్పారావు కాలనీలోని టిడ్కో ఇళ్లను గురువారం అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ నూజివీడు పట్టణంలో అర్హులైన లబ్ధిదారులకు సంక్రాంతి నాటికి కనీసం వెయ్యి టిడ్కో ఇళ్లను అందిస్తామన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం నిరుపేదలకు పక్కా గృహాలు అందించాలనే లక్ష్యంతో విశాలమైన టిడ్కో ఇళ్లను నిర్మించిందని, వాటిలో చాలా వరకు 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన చిన్న చిన్న పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం వీటిని పక్కనబెట్టిన కారణంగా లబ్ధిదారులు ఎంతో నష్టపోయారన్నారు. కేంద్రం నిధులను దారి మళ్లించి లబ్ధిదారులను బ్యాంకర్ల ద్వారా అవమానానికి గురి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం టిడ్కో లబ్ధిదారులను బ్యాంకర్లు రుణ చెల్లింపుల కోసం ఒత్తిడి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా రెండు సంవత్సరాలుగా వడ్డీ లబ్ధిదారులు చెల్లించాలా, లేదా ప్రభుత్వం చెల్లించాలా అనే మీమాంస ఏర్పడిందన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులందరికీ ఏడాదిన్నర కాలంలో పూర్తిచేసి అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ఎల్అండ్‌టి కంపెనీతో సంప్రదించామని, వారు ఇళ్లను పూర్తి చేసేందుకు సుముఖంగా ఉన్నారని మంత్రి వెల్లడించారు. మొత్తం 2640 ఇళ్లకుగాను సంక్రాంతి నాటికి కనీసం వెయ్యి ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టిడ్కో ఇళ్ల పీడీ బి.చిన్నోడు, డిఇ శాంతకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టణంలో మంత్రి సుడిగాలి పర్యటన

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. నూజివీడు పట్టణంలో గురువారం వివిధ కాలనీల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యతని చెప్పారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 15వ వార్డులోని ఎన్‌టిఆర్ కాలనీని సందర్శించారు. అక్కడి ప్రజలు తమ కాలనీలో తాగునీటి బోరు మరమ్మతుకు గురైందని తెలియజేయగా శుక్రవారం ఉదయం నాటికి మరమ్మతులు చేయించాలని మున్సిపల్ అధికారులను మంత్రి ఆదేశించారు. ఎస్‌టిలు తమ ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని కోరగా పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను మంత్రి ఆదేశించారు. చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో మురుగుతో నిండిన డ్రెయినేజీని పరిశీలించి తక్షణమే పూడిక తీయించాలని మునిసిపల్ డిఇ లక్ష్మీనారాయణను ఆదేశించారు. అనంతరం ఎంప్లాయీస్ కాలనీలోని ఇండోర్ స్టేడియంను పరిశీలించారు. స్టేడియం అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తొలుత మంత్రి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందించి, శాలువాలతో సత్కరించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపు యత్నాలు తగవు

డిఇఒకు నేతల వినతి



డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మధ్యాహ్న భోజన కార్మికులు వైదొలగాలంటూ అధికార పార్టీ నాయకులు బెదిరించడం, లేకుంటే తామే తీసివేస్తామని ఒత్తిడి చేయడం తగదని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం, సిఐటియు నేతలు డిఇఒ అబ్రహంను కోరారు. ఈ మేరకు వారు డిఇఒకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ పెదవేగి, ద్వారకాతిరుమల, దెందులూరు, భీమడోలు మండలాల్లో గ్రామస్థాయి అధికార పార్టీ నాయకులు మధ్యాహ్న భోజన కార్మికులను మానివేయాలని, లేకుంటే తామే తీసివేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారని, ఇది పూర్తి అప్రజాస్వామికమని అన్నారు. గత ప్రభుత్వం కూడా ఇలాంటి చర్యలకు పాల్పడే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, ప్రస్తుత టిడిపి ప్రభుత్వం అలాంటి చర్యలకు పాల్పడటం భావ్యం కాదని అన్నారు. గత 20 సంవత్సరాలకుపైగా ఆర్థిక ఇబ్బందులతో అతి తక్కువ జీతాలతో పేద పిల్లలను తమ సొంత బిడ్డల్లా చూసుకుంటూ.. నిబద్ధతతో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులపై అధికార పార్టీ జులుం ప్రదర్శించడం సరైంది కాదన్నారు. తక్షణమే బెదిరింపులు ఆపాలని, పాత వాళ్లను కొనసాగించాలని ఆమె కోరారు. లేకుంటే ఏ గ్రామానికి ఆ గ్రామ పాఠశాలల వద్దే నిరాహార దీక్షలు చేస్తామని తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కక్ష సాధింపులకు పాల్పడటం మంచిది కాదని, జగన్ దారిలోనే టిడిపి వారు ప్రయాణం చేయడం వారికే నష్టమని తెలిపారు. దీనిపై డిఇఒ అబ్రహం మాట్లాడుతూ మండలాల్లో తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒలతో ఉన్న కమిటీకి తెలియకుండా, వారి ఆమోదం లేకుండా ఎక్కడా కార్మికులను తొలగించడం సాధ్యం కాదని తెలిపారు. తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు లక్ష్మి, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

పాలసానిపల్లి సర్పంచి షేక్ రహీమాబేగం హసేన

చిన్నరులకు పుస్తకాలు అందిస్తున్న సర్పంచి రహీమాబేగం

ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి, విద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతులు అందజేస్తున్న దాతల సహకారం అభినందనీయమని పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమాబేగం హసేన అన్నారు. పంచాయతీ పరిధిలో గురువారం నిర్వహించిన రెండు వేర్వేరు కార్యక్రమాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎంపిపి ప్రాథమిక పాఠశాల నెంబర్-2లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీని సర్పంచి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసరావు, గ్రామంలోని ఇతర పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు బాలభాస్కర్, మోహన్‌రావు పాల్గొన్నారు. విజయవాడకు చెందిన దాత ఎన్.రవికిరణ్ తన తల్లి జ్ఞాపకార్థం సమకూర్చిన వాటర్ బాటిల్స్, పెన్నుల పంపిణీ కార్యక్రమాన్ని దాతల భాగస్వామ్యంతో సర్పంచి నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ మూడో వార్డు సభ్యులు భీమడోలు రామకృష్ణ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన మరో కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయంలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌తోపాటు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు ఫొటో ప్రేముల ఏర్పాటును పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి యు.జయరామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను కలిసిన ఇరిగేషన్ ఉద్యోగుల నేతలు



మంత్రి నిమ్మలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చోడగిరి, తదితరులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిమ్మల రామానాయుడిని సచివాలయంలో గురువారం ఇరిగేషన్ ఉద్యోగుల తరపున రాష్ట్ర ఇరిగేషన్ డిపార్టుమెంట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు నేతృత్వంలో బృందం కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా చోడగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరిగేషన్, ప్రాజెక్టుల అభివృద్ధికి ఉద్యోగులుగా తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి నిమ్మల మాట్లాడుతూ త్వరలో ఉద్యోగ సంఘ నేతలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రెవెన్యూ ఉద్యోగులకు చట్టాలపై అవగాహనుండాలి

ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ

రాఘవులను సత్కరిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజలకు మంచి సేవలు అందించాలంటే రెవెన్యూ ఉద్యోగులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏలూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఖాజవలీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రెవెన్యూ భవనంలో రెవెన్యూ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఖాజావలీ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ చరిత్రను, విశిష్టతను కూలంకుషంగా వివరించి, ఎప్పటికప్పుడు ప్రజలతో రెవెన్యూ ఉద్యోగులు సత్సంబంధాలు కొనసాగించాలని, ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ పథకములు ప్రజలకు చేరువ చేయడంలో రెవెన్యూ శాఖ ముందుండాలని తెలియజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి ప్రమోద్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌వి.రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి రెవెన్యూ అధికారి వరకూ బోర్డర్‌లో సైనికుడు వలె అలుపన్నది లేకుండా పౌరులకు సేవలందించడంలో శ్రమిస్తారని కొనియాడారు. ఉద్యోగుల శిక్షణకు త్వరలోనే ఏలూరు కేంద్రంగా ఒక జిల్లా స్థాయి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం రెవెన్యూ శాఖలో పనిచేసిన కాలంలో పౌరులకు విశిష్ట సేవలందించి రెవెన్యూ శాఖ ఔనత్యాన్ని ఇనుమడింపజేసిన విశ్రాంత తహశీల్దార్లు వివి.జగన్మోహనరావు, ఎమ్‌హెచ్.మణి, బి.బెన్నీ, ఎస్.సత్యనారాయణ, జిజెఎస్.కుమార్, రామకృష్ణ ఆర్.పోతురాజు, సీతారాంలను, విశ్రాంత ఆఫీసు సబార్డినేట్ రాఘవులును ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.రవిచంద్ర, జాయింట్ సెక్రటరీ మాధవి, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీను నాయక్ పాల్గొన్నారు.

మట్టి, కంకర తవ్వకాలపై అలసత్వం వద్దు

ప్రభుత్వ విధానానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలి

అధికారులతో సమీక్షించిన ఎంఎల్‌ఎ ధర్మరాజు



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ఉంగుటూరు

అధికారులు ప్రభుత్వ విధానం, నిబంధనలకు లోబడి పనిచేసి ప్రజా ప్రతినిధులకూ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం నారాయణపురం క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ, సివిల్ సప్లై, హార్టికల్చర్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. తొలుత రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ ఇంతవరకు ఇళ్ల స్థలాల పంపిణీకి ఎన్ని ఎకరాలు సేకరించారు? స్థలాల పట్టాలు ఎన్ని ఇచ్చారు? ఎంతమంది ఇల్లు కట్టుకున్నారు? పెండింగ్ స్థలాలు పంపిణీ, అభివృద్ధిపై నాలుగు రోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. నివేదిక అందగానే గృహ నిర్మాణ శాఖా మంత్రితో మాట్లాడి త్వరితగతిన అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని ధర్మరాజు చెప్పారు. పలు ప్రాంతాల్లో రాత్రి, పగలు అనధికారికంగా మట్టి, కంకర జరుగుతున్నాయని, అలాంటి తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలని, అలాంటి వారిపై ఉపేక్షించకుండా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ చెప్పారు. మట్టి తవ్వకం దారులకు అధికారులు వత్తాసు పలికితే సహించేది లేదని హెచ్చరించారు. అక్రమంగా మట్టి తవ్వితే సంబంధిత అధికారులపై తగు చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. వెంకటరామన్న గూడెం హార్టికల్చర్ విశ్వవిద్యాలయం అధికారులతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానంగా పంటల మార్పిడి, ఉద్యానవనం పంటల సాగుపై అవకాశాలపై నివేదిక ఇవ్వాలని కోరారు. భీమడోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పురోగతిపై ఆ శాఖ వైద్యులతో మాట్లాడారు. తహశీల్దార్లు కట్టా శివయ్య, వరహాలరావు, డిటి దుర్గాప్రసాద్, సివిల్ సప్లై డిటి మాధవరావు, స్వర్ణ దుర్గ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఫాసి లైసెన్సుల పేరుతో దందా..!

చిరు వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు పిండి రాము

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెంలో పలు చిరు వ్యాపారుల దగ్గర ఫాసి లైసెన్సుల పేరుతో కొంతమంది నయా దందా సాగిస్తున్నారని చిరు వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు పిండి రాము తెలియజేశారు.

ఇండియన్ ఫుడ్ సొల్యూషన్ పేరుతో ఒక్కొక దుకాణానికి రూ.1,461 బలవంతంగా వసూలు చేస్తున్నారని, నగదు ఇవ్వకపోతే ఫుడ్ ఇన్స్‌పెక్టర్ మీ దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. గురువారం వారు షాపులపై కాశీ పేరుతో దండాలు వసూలు చేస్తున్న సమయంలో వారిని ఆయన నిలదీశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

కోళ్ల వ్యర్థాలను మేతగా వాడితే చర్యలు : తహశీల్దార్

భీమడోలు: భీమడోలు మండల పరిధిలో కోళ్ల వ్యర్థాలను చేపల మేతగా వాడే చెరువుల యాజమానులపై చర్యలు తీసుకుంటామని భీమడోలు తహశీల్దార్ వరహాలయ్య హెచ్చరించారు. ఇటీవల కాలంలో మండల పరిధిలోని అన్ని రెవెన్యూ గ్రామ పరిధిలో గల చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను చేపల మేతగా వాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదే క్రమంలో అడపా, తడపగా పోలీసులు తనిఖీలను నిర్వహించి కేసులను నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ కోళ్ల వ్యర్థాలు చేపల మేతగా వాడటం తగ్గని విషయం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో భీమడోలు తహశీల్దార్ గురువారం సాయంత్రం తన కార్యాలయంలో రెవెన్యూ, వన్యప్రాణి సంరక్షణ శాఖ(అటవీ శాఖ), మత్స్యశాఖ, పోలీస్ శాఖ అధికారులతో పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోళ్ల వ్యర్థాలను చేపల మేతగా వాడటం అదుపు చేసేందుకు తగు చర్యలను తీసుకుంటామన్నారు. అటువంటి వాహనాలను అదుపులోనికి తీసుకోని సీజ్ చేస్తామన్నారు. అనంతరం అధికారులు సభ్యులుగా గల కమిటీ భీమడోలు గ్రామ రెవెన్యూ పరిధిలోని లింగం పాడు ఆవాస ప్రాంతంలోని చేపల చెరువులను పరిశీలించారు. చర్యల గురించి రైతులకు వివరించారు.

ఇంటింటా సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

విద్యాశాఖ ఆధ్వర్యాన స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల
మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను మండల విద్యాశాఖ అధికారి పి.వెంకట్రావు గురువారం నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్(ఇఎస్‌సి) పిల్లల సర్వే నిర్వహించి 6 సంవత్సరాలు వచ్చిన పిల్లల్ని పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ద్వారకా తిరుమల కొండ ప్రాంతంలోని యానాదుల కాలనీలో ఈ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.తులసి వరలక్ష్మి, ఎంపిపి ఎస్‌డి.తిరుమల, ప్రధాన ఉపాధ్యాయుడు టి.రాంబాబు, సిఆర్‌పి టి.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

వికలాంగుల నిర్ధారణ వైద్య శిబిరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల
మండలంలోని ప్రత్యేక అవసరాల గల బాల బాలికలకు ఉచిత ఉపకరణాల పంపిణీకి వికలాంగుల నిర్ధారణ గుర్తింపు వైద్య శిబిరం పోస్టర్‌ను మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి పి.వెంకట్రావు ఆవిష్కరించారు. సమగ్ర శిక్ష జిల్లా ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని ఎలిమెంటరీ సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలలోని 6 నుంచి 18 సంవత్సరాల విశేషాంగ బాలబాలికల అర్హతగల గుర్తింపు శిబిరం పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్ వి.చంద్రశేఖర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఐఆర్‌టిలు ఎన్.దయామని, కె.భువనేశ్వరి, పి.పద్మావతి పాల్గొన్నారు.

మేఘలాదేవిని కలిసిన అంగన్వాడీలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం
గోపాలపురం మండలం అంగన్వాడీ కార్యకర్తలు టిడిపి రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్డి మేఘలాదేవిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించి, సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, జీతం పెంపుదలకు కృషి చేయాలని కోరారు. ఈ ప్రభుత్వంలో తమ కష్టాలు తీరుతాయని, బాధ్యతగా తీసుకుని తమ సమస్యలను పరిష్కరిస్తానని మేఘలాదేవి అన్నారు.

ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి

జిల్లా రైతు సంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు

ప్రజాశక్తి - ముసునూరు
కౌలు రైతులకు కౌలు కార్డులు అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన ముసునూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద కౌలు రైతులకు కౌలు కార్డులు అందజేసి ఆదుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కె.వి.కుమారికి వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నాగేశ్వరరావు, సురేష్ చంద్ర బెనర్జీ, శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళా కార్మికులను ఆదుకోవాలి

ఐఎఫ్‌టియు నేతల విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
ఏలూరు నగరంలో వందలాదిగా పనిచేస్తున్న మహిళా చుట్టల కార్మికులను ఆదుకోవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్ద వెంకట్రావు అన్నారు. ఐఎఫ్‌టియు అనుబంధ చుట్టల కార్మికుల సంఘం జనరల్ బాడీ సమావేశం గురువారం చోడిదిబ్బ ఏరియా పెద్ద రామాలయం వీధిలో ఉన్న కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఈ సమావేశానికి ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్ద వెంకట్రావు, ఏలూరు నగర నాయకులు గడసాల రాంబాబు, అప్పారావు హాజరై మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు ఓసారి జరిగే వేతన ఒప్పంద అగ్రిమెంట్ విషయంలో టొబాకో మర్చంట్ మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్ చొరవ తీసుకుని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయాలని కోరారు. కూలీ రేట్ల పెంపుదల చేయాలని కోరుతూ డిమాండ్‌తో కూడిన వినతిని ఈనెల 25వ తేదీన యజమానులకు అందజేయాలని జనరల్ బాడీ తీర్మానం చేశారు. ఈ సమావేశానికి ఎం.లక్ష్మి, కృష్ణవేణి, మహాలక్ష్మి, శ్యామల నాయకత్వం వహించారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

జీలుగుమిల్లి: మండలంలోని లక్ష్మీపురం సెంటర్‌లోని జాతీయ రహదారిపై లారీని వెనక నుంచి వస్తున్న ఆటో క్రాస్ చేయబోయి ఎదురుగా వస్తున్న ప్రయివేటు ట్రావెల్ బస్‌ను ఢీ కొన్న ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపురం సెంటర్‌లోని మలుపు వద్ద కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీను తాడువాయి నుంచి వస్తున్న ఆటో క్రాస్ చేయబోగ ఎదురుగా హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ప్రయివేటు ట్రావెల్ బస్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బస్ డ్రైవర్ అప్రమత్తమై సడన్ బ్రేక్ వేయడంతో పెను ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనలో బస్, ఆటో ముందు భాగాలు ధ్వంసం అయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు తెలిపారు.

సంఘ విద్రోహులపై చర్యలు తీసుకోవాలి

కొయ్యలగూడెం : సంఘ విద్రోహ అసాంఘిక కార్యకలాపాలకు బానిసలు అవుతున్న యువతపై చర్యలు తీసుకోవాలని కొయ్యలగూడెం సమైక్య యూత్ సభ్యులు ఎస్ఐ జిజె.విష్ణువర్ధన్‌కు తెలిపారు. సమైక్య యూత్ సభ్యులు మాట్లాడుతూ కొయ్యలగూడెం పట్టణంలోనే కాకుండా మండలంలో పలు గ్రామాల్లో యువత గుంపులు గుంపులుగా కూర్చొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వారికి అవగాహన కల్పించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్ కు వినతిని అందజేశారు.


మాట్లాడుతున్న రోషన్ కుమార్

సమన్వయంతో పనిచేస్తా

ఎంఎల్‌ఎ రోషన్ కుమార్

కామవరపుకోట: పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ పని చేస్తానని ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు కిలారీ సత్యనారాయణ అధ్యక్షతన గుంటుపల్లి గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభకి ఆయన విచ్చేశారు. ఎంఎల్ఎగా గెలిచిన తర్వాత మొదటిసారి మండలంలో పర్యటనకు వచ్చిన ఆయనకి ప్రజలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. టిడిపి గెలుపునకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

జీలుగుమిల్లి: మండలంలోని అంకన్న గూడెం గ్రామ శివారులో గురువారం కోడి పందేల శిబిరంపై దాడులు చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంకన్నగూడెం గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నారని సమాచారం మేరకు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,160 నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకొని వారందరినీ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మండవల్లిలో అడుగంటిన మంచినీటి చెరువు

చావలిపాడులో అడుగంటిన మంచినీటి చెరువు

అడుగంటిన చెరువులు.. మిన్నంటిన దాహం కేకలు

తాగునీరందించాలని గ్రామీణుల ఆవేదన

ప్రజాశక్తి - మండవల్లి
గ్రామాల్లోని మంచినీటి చెరువులు అడుగంటాయి. తాగునీరు అందకపోవడంతో గ్రామాల గొంతెండుతోంది. కాలువల ద్వారా తాగునీరు విడుదల కాకపోవడంతో గ్రామాల్లో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. మండవల్లి మండలంలో సుమారు 48 వేల 627 మంది జనాభాకు 27 మంచినీటి చెరువులకు 25 రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి. అయితే ఈ సంవత్సరం ఎన్నడూ లేని విధంగా ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో మంచినీటి చెరువులలోని నీరు అధిక వేడిమికి ఆవిరైపోయాయి. దీంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. కొల్లేరులో రెగ్యులేటర్ లేకపోవడంతో వేసవికి ముందే కొల్లేరు ఎండిపోయి ఎడారిని తలపించడంతో కొల్లేరు పరివాహక ప్రాంతం గుక్కెడు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. చెరువుల్లో నీరు అడుగంటడంతో ప్రజల గొంతు ఎండిపోతోంది. ప్రజలు ఆర్ఒ ప్లాంట్లను ఆశ్రయించి దాహార్తిని తీర్చుకోవలసిన పరిస్థితి నెలకొంది. జూన్ నెల చివరి దశకు వచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో వర్షాలు పడకపోవడంతో కాలువల ద్వారా నీరు విడుదల చేయకపోవడంతో, గ్రామాల్లో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. గ్రామాల్లో అరకొరగా ఉన్న బోర్లు బావులు కూడా మితిమీరి సాగుతున్న రొయ్యల చెరువులు కారణంగా ఉప్పు కయ్యలుగా మారాయి. దీంతో తాగునీటి సమస్య మరింత జటిలమైంది అంతేకాకుండా కానుకొల్లు జాతీయ రహదారి పక్కన ఉన్న సుమారు వందేళ్ల పైబడిన నాటి బావిపై సుమారు 14 గ్రామాల ప్రజలు ఆధారపడి దాహార్తిని తీర్చుకునేవారు. అయితే జాతీయ రహదారి అభివృద్ధి పనులలో భాగంగా ఆ భావిని తొలగించడంతో ప్రజలు తాగునీటి కోసం ఎన్నడూ లేని విధంగా ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. మండల కేంద్రమైన మండవల్లిలో సుమారు 48 వేల 627 మంది జనాభా ఉండగా వారి దాహార్తిని తీర్చే విధంగా మండవల్లిలో సుమారు 12 ఎకరాల మొగలిచెరువుపై 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి పథకం, స్టేషన్ రోడ్‌లో సుమారు 5 ఎకరాలు, కొండ రాయి చెరువు వద్ద 60 వేల లీటర్లగల సామర్థ్యం కలిగిన మరో మంచినీటి పథకం ఉన్నప్పటికీ గ్రామస్తుల తాగునీటి అవసరాలను తీర్చలేకపోతున్నాయి. మంచినీటి చెరువులు పూర్తిస్థాయిలో అడుగంటడంతో గత కొద్ది రోజుల నుంచి రెండు రోజులకు ఒకసారి మాత్రమే కుళాయిల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పూర్తిస్థాయిలో నీరందక గ్రామస్తులు తాగునీటి కోసం నరకయాతన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలువలకు నీటిని విడుదల చేసి, మంచినీటి చెరువులను నింపి ఆదుకోవాలని, అప్పటివరకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి డిఇ విశ్వ కుమార్‌ను వివరణ కోరగా ప్రస్తుతం ఎక్కడా కూడా నీటి నిలవలు లేవని, పట్టిసీమలో 13.5 శాతం మాత్రమే నీరు నిల్వ ఉందని అది 14 శాతానికి పెరిగితే తాగునీటి అవసరాల నిమిత్తం పట్టిసీమ ద్వారా నీటిని విడుదల చేస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

పలు పాఠశాలల్లో విద్యార్థులకు కిట్లు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్టూడెంట్ కిట్స్‌ను ఉపయోగించుకుని ఉన్నత చదువులు చదివి అభివృద్ధి చెందాలని ఎంపిపి కొండా దుర్గ భవాని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'బడికి పోదాం రా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమం పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వాణి కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న పిల్లలు ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదివి గ్రామానికి సేవ చేయాలని గ్రామ సర్పంచి కె.విజయలక్ష్మి విద్యార్థులకు హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో దేవినేని వరప్రసాద్, ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు, తులిమెలి రంగారావు, చలసాని కుటుంబరావు, తుమ్మల లక్ష్మణరావు, పాఠశాల ఉపాధ్యాయులు నాగేశ్వరావు, పిడి.హేమ, అలీ ఖాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వం అందించే సకల సదుపాయాలతో విద్యార్థులు మంచిగా చదువుకోవాలని వైస్ ఎంపిపి పాముల గంగాధరరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'బడికి పోదాం రా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కంచర్ల వాణి, ప్రధానోపాధ్యాయులు ఎల్‌విఎస్ నాగేంద్రరావు, లెక్కల మాస్టర్ వెంకటేశ్వరరావు, బుజ్జియ్య పాల్గొన్నారు.

మండవల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవం కలిగిన, నిష్ణాతులైన, ప్రభుత్వం ఎంపిక చేసిన, చక్కని విద్యాభివృద్ధులు నేర్పగలిగిన ఉపాధ్యాయులు పాఠశాలలో ఉన్నారని ఆయన అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను, ఏకరూపు దుస్తులను, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతో పాటు అనేక మౌలిక వసతులను ఏర్పాటు చేయడం కూడా జరిగిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని, విద్యలో రాణించి, ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మాధవ కుమార్, ఉపాధ్యాయులు కురేళ్ల శ్యామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపిపి దారబోయిన లక్ష్మి, టిడిపి, జనసేన మండల నాయకులు జయవరపు శ్రీరామూర్తి, అడపా నాగరాజులు సూచించారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో గురువారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలస్థాయిగా ఉన్న 60 పాఠశాలలకు 4,133 మంది విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు విద్య పట్ల శ్రద్ధ వహించాలని, ఉన్నతమైన లక్ష్యం పెట్టుకుని వాటిని సాధించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూస్, బ్యాగ్లు, కిట్లు అందిస్తుందని, మధ్యాహ్నం నాణ్యమైన భోజనం, తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందిస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి కలెక్టర్, ఐపిఎస్ వంటి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన అందించి ప్రతి ఒక్కరినీ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో చదువుకోవడానికి విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు ఏర్పాటు చేస్తానని జయవరపు శ్రీరామూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.కళ్యాణి, టి.రామ్మూర్తి, దేవరపల్లి సీతారాం ప్రసాద్, నాయుడు రామకృష్ణ, ఎంపిటిసిలు, హెచ్ఎం, లింగుస్వామి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : జంగారెడ్డిగూడెంలోని 27వ ఎలిమెంటరీ పాఠశాలలో గురువారం స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రాంకుమార్ పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న పుస్తకాలు, ఇతర సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేతలు మద్దిపాటి నాగేశ్వరరావు, చేను ప్రసాద్, చిట్లూరి బాపినీడు, సెక్రటరీ కన్నా శ్రీదేవి, సేలం రాంబాబు పాల్గొన్నారు.

ముసునూరు: జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న నాయకులు


రెవెన్యూ డే సందర్భంగా పుల్లయ్యను సత్కరిస్తున్న పవన్‌కుమార్

రెవెన్యూ సేవలను ఉపయోగించుకోవాలి

ఇన్‌ఛార్జి తహశీల్దార్ జి.పవన్‌కుమార్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి
రెవెన్యూ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆగిరిపల్లి మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్ జి.పవన్‌కుమార్ అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా గురువారం ఆగిరిపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద గతంలో గ్రామ పరిపాలన అధికారి(విఎఒ)గా పనిచేసిన విశ్రాంత ఉద్యోగి కడార్ల పుల్లయ్యను రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నవీన్, నాంచారమ్మ, విఆర్ఒలు రవిశేఖర్, శ్రీనివాసరావు, విఘ్నేష్, వంశీ నాగరాజు, రజిని, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి పలు సమస్యలు

ప్రజాశక్తి - ముసునూరు
మండలంలోని పలు సమస్యలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు తెలిపారు. గురువారం నూజివీడు టిడిపి కార్యాలయంలో ముసునూరు మండల నాయకులైన టిడిపి మండల అధ్యక్షులు దేవినేని డలరామ్, కొల్లి గంగారామ్, మెదరమెట్ల సురేంద్ర, పలువురు నాయకులు మండలంలోని 16 గ్రామాల్లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి ఆయా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారని తెలిపారు.

మిత్ర పురుగుల ఉత్పత్తికి శిక్షణ

ప్రజాశక్తి - చింతలపూడి
క్షేత్రస్థాయిలో రైతులకు మిత్ర పురుగులు అధిక సంఖ్యలో ఉత్పత్తి చేసే విధంగా శిక్షణ ఇప్పించి రైతులకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని హెచ్ఆర్ఎస్ అంబాజీపేట, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బిఎన్‌వి.చలపతి రావు తెలిపారు. చింతలపూడి మండలం అల్లిపల్లి గ్రామంలో గురువారం ఉద్యాన పరిశోధన స్థానం, అంబాజీపేట నుంచి ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ బిఎన్‌వి.చలపతి రావు, కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష, చింతలపూడి ఉద్యాన శాఖ అధికారి ఎండి.షాఫియా, కొబ్బరి అభివృద్ధి బోర్డు డిడి డాక్టర్ కుమార్ వేల్, ఫీల్డ్ ఆఫీసర్ కిరణ్, విఎహెచ్ విచ్చేసారు. గత మార్చి నెలలో నల్ల ముట్టుపురుగు నివారణకు లోడప్ స్కీంలో భాగంగా 53 హెక్టర్ల కొబ్బరి తోటలకు బ్రకాన్, గోనియోఝూస్ బధనికలు ఇవ్వడం జరిగింది. రైతులు తమకు ఎంతగానో సహాయపడిన ఉద్యాన శాఖ అధికారి, శాస్త్రవేత్తలు, సిడిబి అధికారులకి కృతజ్ఞతలు తెలిపారు.


కొబ్బరి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్
టిడిపిని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూనే జనసేన, బిజెపిలను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి అందరికీ అన్ని పథకాలు అందేవిధంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో మంచి పేరు సంపాదించుకోవాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. గురువారం దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు మండలం చల్ల చింతలపూడి శివారు కొత్త కమ్మువారిగూడెం గ్రామానికి చెందిన టిడిపి నేతలు పుసులూరి ప్రసాద్, పుసులూరి యుగంధర్, పలువురు టిడిపి నేతలు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చల్ల చింతలపూడి గ్రామం మొత్తం కలిసికట్టుగా పార్టీ అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని, వివాదాలకు, గ్రూపులకు దూరంగా ఉండాలని చింతమనేని ప్రభాకర్ కొత్త కమ్మువారిగూడెం నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పుసులూరి ప్రసాద్, పుసులూరి యుగంధర్, తూంపాటి ఆంజనేయులు, వాకలపూడి వెంకటరత్నం, సుంకవల్లి మధుతో పాటు పలువురు టిడిపి నేతలు ఉన్నారు.

కొత్తకమ్మువారి గూడెం టిడిపి నేతలతో ఎంఎల్ఎ చింతమనేని

మోసపూరితంగా ప్రభుత్వ మద్దతు ధర : రైతు సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
14 రకాల పంటలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు మోసపూరితమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. ఏలూరు పవర్ పేట అన్నే భవనంలో గురువారం ఆయన కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతు ధరలపై మీడియాతో మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచలేదని అన్నారు. రైతుల వాస్తవ ఖర్చులను పరిగణలోకి తీసుకోకుండా మద్దతు ధరలు ప్రకటించడం వల్ల ఉత్పత్తి ఖర్చులు కంటే తక్కువ ధరలు వచ్చి అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరికి క్వింటాల్‌కు కేవలం రూ.117 మాత్రమే పెంచి చేతులు దులుపుకున్నారని చెప్పారు. వరికి క్వింటాల్ ఉత్పత్తికి రూ.2 వేల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ధాన్యానికి క్వింటాలకు రూ.3 వేల వరకు మద్దతు పెంచాల్సి ఉందన్నారు. మొక్కజొన్నకు రూ.135, జొన్నకు 191, పెసలకు రూ.124, మినుములకు రూ.450, ప్రొద్దుతిరుగుడుకు రూ.520, వేరుశనగకు రూ.406 మాత్రమే ధర పెంచారని చెప్పారు. అన్ని రకాల ఉత్పత్తి ఖర్చులు దారుణంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని కోరారు. ఈ కంటి తుడుపు మద్దతు ధరలపై రైతాంగం నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు.

వ్యాయామ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ఏలూరు టౌన్: విభజన ఆంధ్రప్రదేశ్‌లో గోపన్నపాలెంలో మిగిలిన ఏకైక ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల అభివృద్ధి, వసతుల పూర్తి స్థాయి కల్పనకు తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సహాయ సహకారంతో గోపన్నపాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలను అత్యుత్తమ కళాశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని గోపన్నపాలెం గ్రామ మాజీ సర్పంచి, టిడిపి మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లు బాబు) అన్నారు. గురువారం గోపన్న పాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.నతానియల్ వ్యాయామ విద్యార్థులు మాగంటి నారాయణ ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కంప్యూటర్, టైలరింగ్ శిక్షణా తరగతులను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్
మండలంలోని గోపన్నపాలెం గ్రామంలోని సెయింట్ ఫ్రాన్సిస్ ట్రైనింగ్ సెంటర్‌లో గోపన్న పాలెం గ్రామంతో పాటు శివారు గ్రామాల మహిళలు, బాలికలకు కంప్యూటర్ డిజిటల్, ఫోటోషాఫ్, టైలరింగ్ కుట్టుమిషన్లపై రెండు నెలలపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సెయింట్ ఫ్రాన్సిస్ ట్రైనింగ్ సెంటర్ బ్రదర్ జోసఫ్ కుమార్ అన్నారు. శిక్షణకు వచ్చే మహిళలు, బాలికలు కేవలం రూ.800 ఎంట్రన్స్ ఫీజు చెల్లించి కంప్యూటర్ డిజిటల్ ఫోటోషాప్, టైలరింగ్ తదితర వాటిపై రెండు నెలల పాటు శిక్షణ తీసుకోవచ్చని తెలిపారు. చదువుకున్న బాలికలు, మహిళలు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని బ్రదర్ జోసఫ్ కుమార్ కోరారు.

సబ్సిడీపై వరి విత్తనాలు సిద్ధం

ముదినేపల్లి: మండలంలోని రైతులకు సబ్సిడీపై సార్వా వరి విత్తనాలు విక్రయించేందుకు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బొర్రా వేణుమాధవ్ గురువారం తెలిపారు. మండలంలోని అన్ని ఆర్‌బికెల్లో 350 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 10 61, 13 18, స్వర్ణ వరి విత్తనాలను కిలో ఒక్కింటికి రూ.5 సబ్సిడీపై విక్రయిస్తున్నట్లు తెలిపారు. పై మూడు రకాల విత్తనాలను 30 కేజీల బస్తా ఒక్కింటికి సబ్సిడి పోను రూ.1,044కు విక్రయిస్తున్నట్లు ఎఒ వేణుమాధవ్ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలలో 'ఎక్ క్లబ్ ఫర్ మిషన్ లైఫ్'

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈక్రమంలో విద్యార్థులతో 'ఎక్ క్లబ్ ఫర్ మిషన్ లైఫ్' పేరిట పర్యావరణం పట్ల శ్రద్ధాశక్తులు ఉన్న విద్యార్థులతో కమిటీ వేశారు. ఆ విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో నీడ, ఫలసాయానిచ్చే మొక్కలను నాటించామని ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు వెల్లడించారు. ఆరోగ్యవంతమైన జీవ శైలిని అలవర్చుకోవడం, వ్యర్థాలను తగ్గించడం, సుస్థిరమైన ఆహారపు అలవాట్లు, శక్తిని ఆదాచేయడం, నీటిని ఆదా చేయడం అంశాలపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యాన అన్నదానం

కామవరపుకోట: టిడిపి ఘనవిజయాన్ని పురస్కరించుకొని టిడిపి ఫోరం సింగపూర్ మెంబర్ మున్నులూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా ఆసరాలైన వృద్ధులకు, వికలాంగులకు రెండు రోజులు పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ టిడిపి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విశాలాంధ్ర విలేకరి మృతికి సంతాపం

కామవరపుకోట: ఇటీవల మృతి చెందిన కామవరపుకోట విశాలాంధ్ర విలేఖరి తాడిగడప రామకృష్ణ(రాము) చిత్రపటం వద్ద పలువురు సిపిఐ నాయకులు, ప్రజాప్రతినిధులు, కళాకారులు, మీడియా మిత్రులు నివాళులర్పించారు. రాము సేవలను కొనియాడారు.

'ప్రజలకు అండగా టిడిపి'

కామవరపుకోట: అన్ని వర్గాల ప్రజలకు టిడిపి అండగా ఉంటుందని సింగపూర్ టిడిపి ఎగ్జిక్యూటివ్ మెంబర్, ఆడమిల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పారేపల్లి సతీష్ తెలిపారు. బుధవారం సచివాలయంలో హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వంగలపూడి అనిత, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మున్సిపల్ అండ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎన్ఆర్ఐ కొండపల్లి శ్రీవాస్‌లను తాడేపల్లిలో వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పారేపల్లి సతీష్ మాట్లాడుతూ టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించిన రాష్ట్ర ప్రజలకు రానున్న రోజుల్లో టిడిపి పాలనతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.

ఘనంగా నారా భువనేశ్వరి పుట్టినరోజు వేడుకలు

ఏలూరు టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, హెరిటేజ్ సంస్థల ఛైర్మన్ నారా భువనేశ్వరి పుట్టినరోజు వేడుకలు దెందులూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి మహిళా నేత, దెందులూరు మాజీ జెడ్‌పిటిసి ముమ్మడి సక్కుకుమారి, చింతయ్య యాదవ్, టిడిపి సీనియర్ నేత, పార్టీ మండల కార్యదర్శి పాల్గొన్నారు.

షార్ట్ టెండరు నోటీసు
ఆర్.ఓ.సి. నెం. 1684/12/2024/ఇ1 తేది.20-06-2024
తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

		ఇ.సి.వి. (రూ. లక్షలలో)
1. అన్నా కాంటీన్ భవన రిపేరు పని	1 నెం.	8.85

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 21-06-2024వ తేదీ నుండి చూడవచ్చును.
సం/- **కమిషనరు**
తణుకు పురపాలక సంఘం

MUNICIPAL CORPORATION, ELURU
TENDER NOTICE No: 1/GEN/2024-25, Dated. 20-06-2024
The Commissioner, Municipal Corporation, Eluru inviting tenders from the interested, eligible Contractors for **"Supply of 7 Nos of Hire Cars to the Officials in Eluru Municipal Corporation"** with an amount of Rs. **31.80** Lakhs.
Last date for receipt of application towards tender schedule is 06-07-2024. Last date of receipt of tenders is 08-07-2024. Further details can be known from this office detailed tender notice or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-232101).
Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU